క్లుప్తంగా

వరద బాధితులకు విరాళాలు



కలెక్టర్ మహేష్‌కుమార్‌కు చెక్కును ఇస్తున్న బాబి

అమలాపురం రూరల్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి అమలాపురానికి చెందిన ఐజేయూ సభ్యుడు, అమలాపురం బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మండెల నాగవెంకట ప్రసాద్(బాబీ) రూ.50 వేల విరాళం అందించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు ఈ చెక్కును అందించారు.అల్లవరం మండలం దేవగుప్తం గ్రామానికి చెందిన బొంతు నాగేంద్రప్రసాద్ తన కుమార్తె పుట్టినరోజు సందర్భంగా రూ.10 వేలను కలెక్టర్‌కు అందజేశారు.


బాలికలు అప్రమత్తంగా ఉండాలి



సదస్సులో అవగాహన కల్పిస్తున్న ఎస్సై కిషోర్‌బాబు

అమలాపురం టౌన్: ఆకతాయిల పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలని అమలాపురం పట్టణ ఎస్సై కిషోర్‌బాబు అన్నారు. గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక గొల్లగూడెంలోని ఆదిత్య స్కూలులో విద్యార్థినులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలపై అఘాయిత్యాల నిరోధానికి పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు. అపరిచిత వ్యక్తులు, ఆకతాయిల ఉనికిని గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ట్రాఫిక్, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. స్కూలు ప్రిన్సిపాల్ కుంటప్ల లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత



చిత్రకారుడు అంజి గీసిన చిత్రం

కాట్రేనికోన: ప్రకృతిని పరిరక్షించుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉందని చిత్రకారుడు ఆకొండి అంజి అన్నారు. ప్లాస్టరాఫ్ పారిస్ వినియోగాన్ని తగ్గించి, మట్టి గణపతికి పూజలు చేయాలన్నారు. ఈ మేరకు గణనాథుడు సందేశం ఇస్తున్నట్లు ఆయన గీసిన చిత్రం పలువురిని ఆకట్టుకుంది.

స్కూల్ డైనింగ్ హాలుకు శంకుస్థాపన



డైనింగ్ హాలు శంకుస్థాపన కార్యక్రమంలో ఎంపీపీ తదితరులు

అమలాపురం రూరల్: బండారులంక గ్రామంలో జెడ్పీ హైస్కూల్‌లో ఏలూరు మోనోలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ స్వచ్ఛందంగా విద్యార్థుల కోసం సొంత ఖర్చుతో నిర్మిస్తున్న డైనింగ్ హాలుకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, సర్పంచ్ పెనుమాల సునీత, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ కూర్మా వీరవేణి, పంచాయతీ సభ్యులు అంకం పెదరాజు, జాన గణేష్, హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టి గణపతిని పూజిద్దాం

కాట్రేనికోన: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతికి పూజలు చేయాలని ఫ్రెండ్లీ క్లబ్ వ్యవస్థాపకులు ఆరకొండి నాగరవీంద్ర జోగయ్యశాస్త్రి అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో గ్రంధి నానాజీ, తాతపూడి లక్ష్మీనారాయణమూర్తి సుమారు 300 మట్టి గణపతి విగ్రహాలను భక్తులకు అందజేశారు. నడవపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు వీటిని తయారు చేశారు.

45 మందికి డాక్యుమెంట్ క్లర్క్ లైసెన్స్‌లు

యానాం: రిజిస్ట్రార్ శాఖకు డాక్యుమెంట్ క్లర్క్‌లుగా పనిచేసేందుకు 45 మంది అభ్యర్థులకు శుక్రవారం సీఎం రంగసామి లైసెన్స్ పత్రాలను అందజేశారు. వీరంతా రిజిస్ట్రేషన్ శాఖ లో డాక్యుమెంట్ క్లర్క్‌లుగా పనిచేయనున్నారు.

ఏకదంతా.. పాహిమాం..



మురమళ్ల మార్కెట్‌లో పత్రి, పూల విక్రయాల దుకాణాలు



యానాం చిన్నా సెంటర్ వద్ద వినాయక పూజకు పత్రి కొనుగోళ్ల సందడి

- వినాయక చవితికి ముస్తాబైన గ్రామాలు
- ఆలయాలు, కూడళ్ల వద్ద పందిళ్ల ఏర్పాటు

ఐ.పోలవరం: విఘ్నాలను రూపుమాపే విఘ్నేశ్వరుని నవరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. చలువ పందిళ్లు, పచ్చని తోరణాలతో పల్లెల్లో వినాయక చవితి సందడి నెలకొంది. గణనాథుడు కొలువుతీరేందుకు నిర్వాహకులు ఎక్కడికక్కడ చలువ పందిళ్లు సిద్ధం చేశారు. ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుద్దీపాలంకరణతోపాటు, భారీ సెట్టింగులు ఏర్పాటు చేశారు. మురమళ్ల, పాత ఇంజరంల్లో ప్రధాన వాణిజ్య కేంద్రాలు చవితి సందడితో కళకళలాడుతున్నాయి. వివిధ గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

ముమ్మిడివరం: గణపతి నవరాత్రి ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వినాయకుని ఆలయాల వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. శనివారం ఉత్సవ విగ్రహ ఏర్పాట్లకు అన్నీ సిద్ధం చేశారు. ముమ్మిడివరం మార్కెట్ ప్రాంతంలో లక్ష్మీ గణపతి, బల్లగేటు సెంటర్‌లో త్రిముఖ గణపతి, పోలీస్ స్టేషన్ సెంటర్‌లో లక్ష్మీగణపతి విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. రాయుడువారి పాలెం, అనాతవరం, క్రాప చింతలపూడి, అయినాపురం, గేదెల్లంక, అన్నంపల్లి, కొమానపల్లి తదితర గ్రామాల్లో ఆలయాల వద్ద మండపాలు, చలువ పందిళ్లు, విద్యుద్దీపాలంకరణలు ఏర్పాటు చేశారు. ముమ్మిడివరం సెంటర్‌లో పూజా సామగ్రి స్టాళ్లు కళకళలాడాయి.

అనుమతులు తప్పనిసరి

వినాయక చవితి ఉత్సవాలకు ప్రభుత్వ అనుమతితో సంప్రదాయ బద్ధంగా నిర్వహించుకోవాలని ముమ్మిడివరం ఎస్సై డి.జ్వాలాసాగర్ తెలిపారు. ఉత్సవాలు జరిగే చోట ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉత్సవాల ఊరేగింపుల్లో అసాంఘిక నృత్యాలు, ప్రజలకు ఇబ్బంది కలిగించేలా డీజే సౌండ్స్ వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా అలంకరణలు చేసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

మంటపాలతో కోలాహలం

యానాం: నియోజకవర్గ పరిధిలో విభిన్న రీతుల్లో గణనాథుని మంటపాలను సుందరంగా తీర్చిదిద్దారు. వివిధ రూపాల్లో బొజ్జ గణపయ్య విగ్రహాలు దర్శనమిస్తున్నాయి. పూజా సామగ్రి కొనుగోళ్లతో స్థానిక విష్ణాలయం వీధి, పిల్లారాయవీధి, పడవలరేవు వీధి తదితర ప్రాంతాలు కిటకిటలాడాయి. చారిత్రక పిళ్లయ్యార్ స్వామి(లక్ష్మీగణపతి) దేవాలయం వద్ద భారీ పందిరిని నిర్మించారు. స్థానిక తోటవారివీధిలో 50 ఏళ్లకు పైగా చరిత్రతో గణనాథుని నవరాత్రి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు. పాత మార్కెట్ వద్ద గణనాథుని ఆలయం వద్ద విశేష పూజలకు ఏర్పాట్లు చేశారు. పాత బస్టాండ్, చిల్డ్రన్స్‌పార్క్, శివాలయం వీధి, ఓల్డ్‌రాజీవ్‌నగర్, బాలయోగి కాలనీ తదితర ప్రాంతాల్లో మంటపాలు ఏర్పాటుచేశారు.

బండార్లంకలో శ్వేతవర్ణ గణపతి



బండార్లంక చినచంద్రాపురంలోని శ్వేతవర్ణ గణపతి

అమలాపురం రూరల్: వినాయక చవితి సందర్భంగా బండార్లంక గ్రామంలో శ్వేతవర్ణంలో విఘ్ననాయకుడు లక్ష్మీగణపతిగా కొలువుతీరాడు. బండార్లంక చినచంద్రాపురంలో శ్వేతవర్ణ లక్ష్మీగణపతి ఆలయం చవితి ఉత్సవాలకు సిద్ధం చేశారు. ఆలయంలో పాలరాతి వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించారు. 79వ వార్షికోత్సవ చవితి ఉత్సవాలు శనివారం నుంచి 9 రోజుల పాటు జరుగుతాయని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఉప్పుగంటి భాస్కరరావు, కార్యదర్శి బళ్ల మల్లేశ్వరరావు తెలిపారు.

మార్కెట్‌కు చవితి శోభ



అమలాపురం గడియారం స్తంభం సెంటరులో పూజా సామగ్రి దుకాణాల్లో భక్తుల సందడి

– పూజా సామగ్రి దుకాణాల కిటకిట

అమలాపురం టౌన్: వినియాక చవితి పండగ సందర్భంగా చవితి నాడు వినాకుడిని పూజించేందుకు, పాలవెల్లుల అలంకరణ కోసం ఉపయోగించే పూజా సామగ్రి దుకాణాలు పట్టణంలో శుక్రవారం భక్తులతో కిటకిటలాడాయి. గడియారం స్తంభం సెంటరు, హైస్కూలు సెంటరు, ముమ్మిడివరం గేటు సెంటరు, నల్లవంతెన, ఎర్ర వంతెన, కాలేజీ రోడ్డు, కలశం సెంటరు తదితర ముఖ్య కూడళ్లలో సుమారు 180 వరకూ పూజా సామగ్రి దుకాణాలు రోడ్ల చెంత తాత్కాలికంగా వెలిశాయి. ఈ దుకాణాలతో పాటు, పూలు, పండ్ల దుకాణాలు కూడా భక్తులతో రద్దీగా కనిపించాయి. స్వీటు దుకాణాల్లో కూడా ఎక్కువ అమ్మకాలు జరిగాయి. పట్టణంలో చవితి మార్కెట్ కారణంగా శుక్రవారం ఒక్క రోజు పూజా సామగ్రి దుకాణాలు, పూలు, పండ్లు, స్వీటు దుకాణాల ద్వారా దాదాపు రూ.40 లక్షల వ్యాపారం జరిగినట్టు అంచనా. పత్రి దుకాణాలు ప్రత్యేకించి ఎక్కువగా ఏర్పాటలయ్యాయి. కలువ పూలను సైకిళ్లపై కొందరు వ్యాపారులు భక్తులకు అధిక ధరకు విక్రయించారు. వినాయక ప్రతిమల విక్రయ దుకాణాలు కూడా ప్రతి కూడలిలో పదుల సంఖ్యలో కనిపించాయి. గడియారం స్తంభం సెంటరు, హైస్కూలు సెంటరు, ముమ్మిడివరం గేటు సెంటరులో పూజా సామగ్రి దుకాణాల్లో వేలాది మంది భక్తులు కొనుగోలు చేశారు. కొందరు కుటుంబ సమేతంగా వచ్చి పూజా సామగ్రి కొనుగోలు చేయడం కనిపించింది. పుస్తకాల దుకాణాలతో పాటు కొందరు వ్యక్తులు వినాయిక చవితి వ్రత పుస్తకాలను అమ్మటం కనిపించింది.

మంటపం ఏర్పాటుపై వివాదం

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీ చినవలస గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద కొందరు యువకులు వినాయక మండపం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుండగా, మరొక వర్గం వారు అభ్యంతరం చెప్పడంతో వివాదం చెలరేగింది. ఈ ప్రాంతంలో వీల్లేదని, వేరే ప్రాంతంలో వేసుకోవాలని చెప్పడంతో ఇరువర్గాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో ఓ వర్గానికి చెందిన యువకులు కోరంగి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఏఎస్సై ఏ.సత్యనారాయణ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని, ఇరువర్గాలతో మాట్లాడారు. గత 25 ఏళ్లుగా ఆలయ ప్రాంగణం ఎదురుగా వినాయక విగ్రహం ఏర్పాటు చేసి నవరాత్రులు నిర్వహిస్తున్నామని, ఇప్పుడు వద్దనడం ఎంతవరకు సమంజసం అని చెప్పారు. ఈ నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ పహరా ఏర్పాటు చేసినట్లు ఏఎస్సై సత్యనారాయణ తెలిపారు.

మళ్లీ పోటెత్తిన వరద



బోడసకుర్రు పల్లిపాలెంలోని మత్స్యకారుల కాలనీలో ప్రవహిస్తున్న వరద నీరు

ముంపులో మత్స్యకారుల ఇళ్లు

అల్లవరం: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రభావంతో బోడసకుర్రు పల్లిపాలెం మళ్లీ వరదలో చిక్కుకుంది. శుక్రవారం ఉదయం నుంచి వరద తీవ్రత పెరగడంతో 45 మత్స్యకారుల ఇళ్లు వరద ముంపులో చిక్కుకున్నాయి. పల్లిపాలెంలో గణపతి ఉత్సవాల కోసం ఏర్పాటుచేసిన చలువ పందిళ్లు వరద నీట మునిగాయి. వైనతేయ నదికి వరద రావడంతో కుమ్మరి కాలువ పొంగుతోంది. గోపాయిలంక ఆక్విడెక్టు నుంచి వరద నీరు ఎదురెక్కి కుమ్మరికాలువ మీదుగా పల్లపు ప్రాంతాలను ముంచెత్తింది. ఇప్పటికే కుమ్మరికాలువ, దేశికోడు డ్రెయిన్లు నిండుకుండలా దర్శనమిస్తున్నాయి. గోషాయిలంక స్లూయిజ్ గేట్లు పునరుద్ధరించాలని డ్రెయిన్స్ అధికారులు ప్రతిపాదనలు చేస్తున్నా, కార్యరూపం దాల్చలేదు. దీంతో బోడసకుర్రులో కంసాలమామిడి, గౌతమినగర్, అల్లవరంలో మామిడితోట, బుండంపేట, కోడూరుపాడులో గుడ్డివానిచింత వరద ముంపునకు గురవుతున్నాయి. వరదలో మత్స్యకారుల ఇళ్లు నీట మునిగినా, కనీసం ఒక్క అధికారి కూడా రాలేదని ముంపు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

ముక్తేశ్వరం–అయినవిల్లిలంక కాజ్‌వే మునక



ముక్తేశ్వరం-అయినవిల్లిలంక ఎదురుబిడెం వద్ద ట్రాక్టర్‌పై లంక ప్రజలను తరలిస్తున్న తహసీల్దార్

అయినవిల్లి: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వరదకు మండలంలోని ముక్తేశ్వరం–అయినవిల్లిలంక ఎదురుబిడెం వద్ద కాజ్‌వే శుక్రవారం నీట మునిగింది. కాజ్‌వేపై వరద నీరు మోకాళ్ల లోతు ప్రవహిస్తుంది. దీంతో అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, కపిలేశ్వరపురం మండలం అద్దంకి వారిలంక గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయినవిల్లి తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ తన సిబ్బందితో కాజ్‌వేపై ప్రయాణించే ప్రజలను ట్రాక్టర్లపై దాటిస్తున్నారు. అత్యవసరమైతే కానీ లంక ప్రజలు బయటకు రావొద్దని ఆమె హెచ్చరించారు. పల్లపు ప్రాంతాల్లో ఉన్న లంక గ్రామస్తులు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. వరద ప్రభావం ఉన్న గ్రామాల్లో రెవెన్యూ అధికారులు, పంచాయతీ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. వరదకు ముక్తేశ్వరం వద్ద వృద్ధగౌతమి పాయలో వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. వృద్ధగౌతమి నదిపై పాత వంతెన పూర్తిగా మునిగింది. అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, చింతనలంక, పొట్టిలంక, కొండుకుదురులంక, తొత్తరమూడిలోని కె.పెదలంక, మడుపల్లిలంక గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లో వరద నీరు చేరింది. ముక్తేశ్వరంలో శ్మశానవాటికలో ఆరడుగుల మేర నీరు ప్రవహిస్తోంది.

నేటి నుంచి పిళ్లైయ్యార్ స్వామి బ్రహ్మోత్సవాలు



యానాంలో కొలువైన పిళ్లైయ్యార్ స్వామి

యానాం: చారిత్రక యానాంలోని పిళ్లైయ్యార్ స్వామి(లక్ష్మీగణపతి) నవరాత్ర బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ క్రమంలో వాహనోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 16 వరకు వినాయకచవితి సందర్భంగా నవరాత్ర బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఏడున టీటీడీ నియమిత వేద పండితులు తాతపూడి రామకృష్ణావధానుల శిష్యులతో వినాయక కథ, రథోత్సవం, 8న హంస వాహనోత్సవం, 9న మయూర వాహనోత్సవం, 10న మూషిక వాహనోత్సవం, 11న నంది వాహనోత్సవం, 12న శేష వాహనోత్సవం, 13న సింహ వాహనోత్సవం, 14న డోలోత్సవం, పుష్పక వాహనోత్సవం, 15న రథోత్సవం, 16న తెప్పోత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలకు శాసన సభ్యులు గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తదితరులు హాజరు కానున్నారని టెంపుల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఖండవల్లి రామకృష్ణ, అర్చకులు మానేపల్లి వీరభద్రం తెలిపారు.

వినాయక మట్టి ప్రతిమల పంపిణీ



వ్యాపారులకు మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ సన్నయ్యదాసు



మట్టి ప్రతిమలను భక్తులకు అందజేస్తున్న సతీష్ తదితరులు

అమలాపురం టౌన్: వినాయక చవితి సందర్భంగా స్థానిక బులియన్ మార్కెట్‌లో వ్యాపారులకు మట్టి వినాయక ప్రతిమలను మున్సిపల్ కౌన్సిలర్ కట్టోజు సన్నయ్యదాసు శుక్రవారం పంపిణీ చేశారు. బులియన్ అసోసియేషన్‌కు చెందిన ఈశ్వర జ్యూయలర్స్ షాపు వారు సమకూర్చిన విగ్రహాలను మార్కెట్‌లోని వ్యాపారులకు అందజేశారు. మట్టి వినాయక ప్రతిమలతో పూజిస్తే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని సన్నయ్యదాసు సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు కట్టోజు రాము, బులియన్ అసోసియషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కోనసీమ ఆహార నిధి ఆధ్వర్యంలో..

పట్టణంలోని పలుచోట్ల కోనసీమ ఆహార నిధి బృందం వినాయక మట్టి ప్రతిమలను భక్తులకు అందజేసింది. మట్టి విగ్రహాలతో భక్తి, పర్యావరణ పరిరక్షణ సాకారమవుతాయని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వీరంశెట్టి సతీష్ అన్నారు. స్థానిక మహిపాలవీధిలోని లక్ష్మీ గణపతి ఆలయం, ఈదరపల్లి రామాలయం వద్ద మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది పిల్లా రామసుబ్బారావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలతో చైతన్యం



అమలాపురంలోని బ్యాంక్ స్ట్రీట్‌లో మట్టి ప్రతిమలను పంచిపెడుతున్న సభ్యులు

అమలాపురం టౌన్: పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక ప్రతిమలనే చవితి పూజల్లో ఉపయోగించాలన్న చైతన్యం భక్తుల్లో పెరిగింది. పట్టణంలో దాదాపు 15 స్వచ్ఛంద సంస్థలు సుమారు 20 వేల మట్టి వినాయక ప్రతిమలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. స్థానిక బ్యాంక్ స్ట్రీట్‌లోని జీవీ మాల్ వేలాది మట్టి ప్రతిమలను పంపిణీ చేసింది. పట్టణ రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు ఎమ్మెస్వీ ప్రసాద్ ఈ ప్రతిమలను పంపిణీ చేశారు. అదేవిధంగా పట్టణ ముస్లిం నాయకులు స్థానిక మసీదు సెంటరులో హిందూ భక్తులకు మట్టి వినాయక ప్రతిమలను పంచిపెట్టారు. నాయకులు ఎండీ బషీర్, మహ్మద్ మెహబూబ్ షరీఫ్, బాషా, షఫీ, మునవర్ తదితరులు వీటిని ఉచితంగా అందించారు.

హైవేలో డ్రైనేజీకి మరమ్మతులు



సుంకరపాలెం జంక్షన్‌లో చేపట్టిన పూడికల తొలగింపు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని సుంకరపాలెం బైపాస్ జంక్షన్‌లో కొంతకాలంగా నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఎన్‌హెచ్ ఏఈ పురుషోత్తం పర్యవేక్షణలో డ్రైనేజీ మరమ్మతులను చేపట్టారు. రహదారిపై, డ్రైనేజీలో పూడికల తొలగింపు నిర్వహించారు.

దివ్యాంగుల పాఠశాలలో చవితి వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న దివ్యాంగులు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ సీతారామపురంలోని రిలయన్స్ ధీరూబాయి అంబానీ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సెంటర్ ఇన్‌చార్జి గోపాల్ నేతృత్వంలో దివ్యాంగులు వినాయకుడు, మూషికుడి వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు స్టీఫెన్, శిరీష, సత్తిబాబు, కొప్పుల శ్రీను, కాలాడి శ్రీనివాస్, శ్రీదేవి, ఉదయకుమారి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

కాట్రేనికోన: ముమ్మిడివరం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలను పల్లంకుర్రు సెక్టారు ఐ.చెరువులో అంగన్‌వాడీ కార్యకర్తలు శుక్రవారం నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎల్‌వీ రమణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ నాతి అలివేణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

విద్యార్థుల సాయం

అమలాపురం రూరల్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సమనస గ్రామానికి చెందిన రామ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సుమారు రూ.35 వేలు విరాళంగా అందించారు. మంచినీరు, స్నాక్స్‌ను స్వయంగా బాధితులకు అందజేస్తామని స్కూల్ నిర్వాహకులు శుక్రవారం తెలిపారు.

చవితికి మంటపాల ముస్తాబు



సుంకరపాలెం జంక్షన్‌లో ముస్తాబైన వినాయక మంటపం

తాళ్లరేవు: భక్తిశ్రద్ధలతో జరిపే వినాయక చవితి వేడుకలకు గ్రామాల్లో మంటపాలు సుందరంగా ముస్తాబయ్యాయి. మండలంలోని సుంకరపాలెం, జార్జీపేట, తాళ్లరేవు, పి.మల్లవరం, కోరంగి, చొల్లంగి, పటవల తదితర ప్రాంతాల్లో భారీ సెట్టింగులతో వినాయక మంటపాలను సిద్ధం చేశారు. విద్యుద్దీపాలంకరణలతో సరికొత్త శోభను తెస్తున్నారు. ప్రముఖ ఆలయాలు, మంటపాలను వివిధ రకాలైన పుష్పాలు, మామిడిఆకులు, అరటి చెట్లతో అలంకరిస్తున్నారు. దీంతో గ్రామాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. వివిధ రకాలైన పూజా సామగ్రి, పత్రి, వినాయక ప్రతిమలు విక్రయించే మార్కెట్లు భక్తులతో సందడిగా మారాయి.

నోటిఫికేషన్ల రద్దుకు ఆమోదం

యానాం: పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్‌ల్లో ఖాళీగా ఉన్న 183 గ్రూప్-బి పోస్టుల భర్తీలో ఎంబీసీలకు, ఓబీసీలకు అంతర్గత రిజర్వేషన్ల అమలు లేకపోవడంతో జారీచేసిన నోటిఫికేషన్లు రద్దు చేస్తూ శుక్రవారం ఎల్జీ కె కై లాషనాథన్ ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 9 శాఖల్లో గ్రూప్-బి కేటగిరీ పోస్టుల భర్తీకి గత ఏడాది నోటిఫికేషన్లు జారీ చేశారు.

పరిపాలనాధికారి బాధ్యతల స్వీకరణ

తాళ్లరేవు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారిగా కె.సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేసిన చింతా మోహనకృష్ణ బదిలీపై వెళ్లారు.

ముంపు సమస్య పరిష్కరించాలి

తాళ్లరేవు: భారీ వర్షాల కారణంగా స్థానిక జెల్లావారిపేట 4వ వార్డు పరిధిలోని ప్రాంతమంతా ముంపునకు గురైందని వార్డు సభ్యుడు చిక్కం సత్తిబాబు, వి.విజయభాస్కరవర్మ అధికారులకు విన్నవించారు. తక్షణం అధికారులు స్పందించి, ముంపునీటిని తొలగించాలని, డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని ఎంపీడీఓ కార్యాలయ ఏఓ కె.సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు.